సాక్షి
వికారాబాద్
ఆదివారం । 7 । జనవరి । 2024




## దేశం గర్వించే..

యువత వ్యసనాలకు బానిసలు కాకుండా సన్మార్గంలో పయనించాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పేర్కొన్నారు. 8లో▸



టెంట్లలో సేదతీరుతున్న ముస్లింలు



పరిగి ఇస్తెమా సదస్సుకు వస్తున్న ముస్లింలు

# ఇస్తెమా ప్రారంభం

పరిగి పట్టణంలోని న్యామత్‌నగర్‌లో శనివారం తబ్లిగీ జమాత్ ఇస్తెమా ప్రారంభమైంది. ఈ సదస్సుకు తెలంగాణ జిల్లాల తోపాటు, దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి లక్ష మందికి పైగా ముస్లింలు వచ్చారు. మూడు రోజుల పాటు సదస్సులు జరగనున్నాయి. ఇందు కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. తొలి రోజు ప్రార్థనల్లో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సదస్సు జరిగే ప్రాంతంలో బస చేయడానికి టెంట్లు వేశారు. నిరంతర విద్యుత్, నీటి వసతి కల్పించారు. ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. – పరిగి

## న్యూస్‌రీల్

### సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన దాము



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నేత దాము

కొడంగల్ రూరల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ కొడంగల్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ దాము శనివారం నగరంలోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కొడంగల్ ప్రాంతవాసి ముఖ్యమంత్రి కావడంతో ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. తన కుమారుడి పుట్టిన రోజు వేడుకలకు సీఎంను ఆహ్వానించినట్లు దాము తెలిపారు.

### దరఖాస్తు గడువు పెంపు

పరిగి: వచ్చే విద్యాసంవత్సరానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ జనరల్ క్యాటగిరీల్లో గురుకులల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు గడువును పెంచినట్లు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. 2023 – 24 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ప్రవేశాలకు అర్హులన్నారు. ఫిబ్రవరి 11న రాత పరీక్ష నిర్వహించి మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### క్యాన్సర్ అంటువ్యాధి కాదు

స్వస్తవ్ క్యాన్సర్ కేర్ ప్రతినిధి డాక్టర్ చతుర్వేది



క్యాన్సర్ పరీక్షలు చేస్తున్న వైద్యులు

దోమ: గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్ కుమార్‌రెడ్డి, స్వస్తవ్ క్యాన్సర్ కేర్ సెంటర్ ప్రతినిధి డాక్టర్ చతుర్వేది సూచించారు. శనివారం దోమ మండలం బొంపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం ఆవరణలో స్వస్తవ్ క్యాన్సర్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రజలకు నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌కు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్యాన్సర్ అంటువ్యాధి కాదన్నారు. ప్రజల్లో నోటి, రొమ్ము, గర్భాశయం క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం డాక్టర్ చతుర్వేదిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం నూతన అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు అశోక్‌రెడ్డి, మణికొండ, ఏఎన్‌ఎంలు సలీమా, అంజమ్మ, ఆశ వర్కర్లు బుద్ధమ్మ, పద్మమ్మ, కాంగ్రెస్ పార్టీ నేతలు నర్సింహారెడ్డి, ఆర్ అంతిరెడ్డి, రమేశ్‌గౌడ్, రమేశ్, మొగులయ్య గౌడ్, బోయిని చంద్రశేఖర్, చాకలి భాస్కర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ధారూరు మార్కెట్‌కు 730 బస్తాల కందులు

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్‌కు శనివారం 730 బస్తాల కందులు వచ్చాయని మార్కెట్ కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు. క్వింటాలుకు రూ. 9వేల నుంచి రూ. 9,260 వరకు అమ్మకాలు జరిగాయని తెలిపారు. సన్న రకం వడ్లు 69 బస్తాలు వచ్చాయని, క్వింటాలుకు రూ. 2,850 నుంచి రూ. 2,970 వరకు, అలాగే దొడ్డు రకం వడ్లు 903 బస్తాలు రాగా క్వింటాలుకు రూ. 2,200 నుంచి రూ. 2,250 వరకు ధర పలికిందని ఆమె వివరించారు.

### డీసీసీ అనుమతి లేకుండా నోటీసులు ఇస్తే వేటే

సాక్షి, రంగారెడ్డి జిల్లా: కాంగ్రెస్ పార్టీ మేయర్లు, చైర్మన్లు ఉన్న మున్సిపాలిటీల్లో పార్టీ జిల్లా శాఖకు తెలియకుండా వారిపై అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చే వారిని ఉపేక్షించేది లేదని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పేర్కొన్నారు. అనివార్యమైతే డీసీసీ అనుమతి తీసుకున్న తర్వాతే నోటీసులు ఇవ్వాలని సూచించారు. ఆదేశాలను ధిక్కరించిన కౌన్సిల ర్లు, కార్పొరేటర్లను పార్టీ నుంచి బహిష్కరించడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు.

# డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల

**జిల్లాలో ఓటర్లు 9,71,011 మంది**

- ఈ నెల 22వరకు కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు అవకాశం
- ఫిబ్రవరి 8న ఓటరు తుది జాబితా



ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్: త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ అందుకు కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను క్రోడీకరించి శనివారం అధికారులు డ్రాఫ్ట్ నోటిఫికేషన్ (ముసాయిదా ఓటరు జాబితా)ను విడుదల చేశారు. గతేడాది నవంబర్‌లో విడుదల చేసిన ఓటరు తుది జాబితా ప్రకారం తీసుకుంటే ప్రస్తుతం జిల్లాలో ఓటర్లు స్వల్పంగా పెరిగారు. మార్పులు, చేర్పులు, కొత్తగా ఓటర్ల నమోదుకు ఈ నెల 22 వరకు గడువు ఇచ్చారు. ఈ క్రమంలో స్పెషల్ క్యాంపెయిన్ డేస్ కూడా నిర్వహించి ఫిబ్రవరి 8న ఓటరు తుది జాబితాను విడుదల చేయనున్నారు. ప్రస్తుతం అధికారులు విడుదల చేసిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ప్రకారం జిల్లాలో 9,71,011 మంది ఓటర్లు ఉన్నారు. గతేడాది ఓటరు తుది జాబితా విడుదల చేసిన సమయంలో జిల్లాలో 9,60,376 ఉండగా ప్రస్తుతం ఓటర్లు స్వల్పంగా పెరిగారు. జిల్లాలో పురుషుల కంటే 5,917 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. 42 మంది ట్రాన్స్ జెండర్స్ ఉన్నారు. శనివారం కలెక్టర్ అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి ముసాయిదా ఓటరు జాబితా గురించి వారికి వివరించారు.

**22 వరకు అభ్యంతరాల స్వీకరణ**

జిల్లాలో ఓటరు నమోదులో భాగంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈ నెల 22వ తేదీ వరకు కొత్తగా ఓటర్ల నమోదు తోపాటు మార్పులు, చేర్పులు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రతి సంవత్సరం ముసాయిదా జాబితా విడుదల తరువాత కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం ఇస్తుంది. అలాగే మృతి చెందిన వారు, నివాసం మారిన వారిని జాబితా నుంచి తొలగిస్తుంది. వీటితో పాటు ఓటరు జాబితాలో పేర్ల సవరణకు, ఓటును మరో చోటికి మార్చుకునేందుకు అవకాశం ఇస్తుంది. ఇందులో భాగంగా ఈ నెల 22వ తేదీ వరకు సవరణలు, ఫిర్యాదులు స్వీకరించనున్నారు. ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి కొత్త ఓటర్ల కోసం దరఖాస్తులు తీసుకోనున్నారు. ఫిబ్రవరి 08న ఓటరు తుది జాబితా ప్రకటించనున్నారు.

**గరుడ యాప్ ద్వారా..**

గతేడాది ఓటరు నమోదు తోపాటు మార్పులు, చేర్పులు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ గరుడ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీనిపై బీఎల్ఓలకు అవగాహన కల్పించారు. మున్సిపాలిటీల్లో బూత్ లెవెల్ అధికారులకు గరుడ యాప్‌పై అవగాహన కనిపించినా కొంత ఇబ్బంది పడుతూ వస్తున్నారు. దీంతో బీఎల్ఓస్‌కు ఈ యాప్‌పై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందనేది స్పష్టమవుతోంది.

**నియోజకవర్గాల వారీగా ఓటర్ల సంఖ్య**

| నియోజకవర్గం | పురుషులు | స్త్రీలు | ట్రాన్స్ జెండర్లు |
|---|---|---|---|
| పరిగి | 1,32,512 | 1,29,856 | 10 |
| వికారాబాద్ | 1,14,773 | 1,15,319 | 13 |
| తాండూరు | 1,16,846 | 1,22,798 | 07 |
| కొడంగల్ | 1,18,395 | 1,20,470 | 12 |

**అభ్యంతరాలుంటే తెలియజేయండి**

ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేశాం. ఈ జాబితాను రాజకీయ పార్టీల నాయకులు పరిశీలించాలి. ఇందులో ఏమైనా అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉంటే తెలియజేయాలి. ఇందు కోసం ఈ నెల 22 తేదీ వరకు గడువు ఉంది. ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకుని ఫిబ్రవరి 8న ఓటరు తుది జాబితాను విడుదల చేస్తాం. ఆలోపు బీఎల్ఓల ద్వారా అవగాహన కల్పిస్తాం. అలాగే ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తాం.

– లింగ్యానాయక్, అడిషనల్ కలెక్టర్




మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

# జిల్లా కోర్టుకు స్థలం కేటాయిస్తాం

- స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్ అర్బన్: పట్టణంలో జిల్లా కోర్టు ఏర్పాటుకు స్థలం కేటాయించడం తోపాటు భవన సముదాయ నిర్మాణానికి కృషి చేస్తామని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం వికారాబాద్ జిల్లా కోర్టు సముదాయంలోని బార్ అసోసియేషన్ నిర్వహించిన ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి సభాపతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు స్పీకర్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చిన జిల్లా కోర్టు భూ సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. సభ్యుల విజ్ఞప్తి మేరకు జిల్లా కోర్టు సముదాయానికి 10 ఎకరాల భూమి కేటాయిస్తామన్నారు. జిల్లాలో రోడ్ల నిర్మాణం, మరమ్మతుల కోసం రూ.400 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, తెలంగాణ బార్ అసోసియేషన్ కౌన్సిల్ మెంబర్ అనంతసేన్‌రెడ్డి, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, కార్యదర్శి ప్రశాంత్ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు బసవరాజ్, గోవర్ధన్ రెడ్డి, యాదవ రెడ్డి, సంపూర్ణ ఆనంద్, మాధవరెడ్డి, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

# రూ.లక్ష నగదు,తులం బంగారం ఇవ్వండి

- నూతన ప్రభుత్వాన్ని కోరిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి
- కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

మహేశ్వరం: కొత్తగా వివాహమైన పేదింటి ఆడబిడ్డకు కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం రూ.లక్ష నగదు, తులం బంగారం ఇవ్వాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి కోరారు. శనివారం ఆమె మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో 65మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఏడున్నర ఏళ్లలో నియోజకవర్గంలో సుమారు 16వేల మందికి పైగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకంలో భాగంగా ఆర్థికసాయం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా నాయక్, తహసీల్దార్ మహ్మద్ అలీ, ఎంపీడీఓ నర్సింహ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ ఆనందం, శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ సుధీర్‌గౌడ్, ఆర్‌ఐలు పావని, స్వర్ణకుమారి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



దరఖాస్తుల డాటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

# డాటా ఎంట్రీలో తప్పులు దొర్లొద్దు

- కలెక్టర్ నారాయణరెడ్డి

పరిగి: ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియలో ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలని కలెక్టర్ నారాయణరెడ్డి సిబ్బందికి సూచించారు. పట్టణంలోని మున్సిపల్, ఎంపీడీఓ కార్యాలయాల తోపాటు శ్రీ సాయి డిగ్రీ, పీజీ కళాశాలలో డాటా ఎంట్రీ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శనివారంతో ప్రజాపాలన కార్యక్రమం ముగిసిందన్నారు. ఈ నెల 17వ తేదీ నాటికి డేటా ఎంట్రీ పూర్తి కావాలని ఆపరేటర్లకు సూచించారు. దరఖాస్తు ఫారాలు గల్లంతు కాకుండా భద్రపరచాలని ఆదేశించారు. అర్జీల్లో సరైన సమాచారం లేకుంటే లబ్ధిదారుడికి ఫోన్ చేసి సేకరించాలని సూచించారు. ఫోన్ నంబర్లు, ఆధార్ నంబర్లు, రేషన్ కార్డు నంబర్లు విధిగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌వి అసత్య ప్రచారాలు

- అధికారంలోకి రాగానే రెండు గ్యారంటీలను అమలు చేశాం
- మరో నాలుగు పథకాల అమలుకే ప్రజాపాలన
- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు టౌన్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై బీఆర్‌ఎస్ పార్టీ అసత్య ప్రచారం చేస్తోందని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 34, 35, 36 వార్డుల్లో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. మోసపూరిత మాటలను గ్రహించిన ప్రజలు ఆ పార్టీకి గుణపాఠం చెప్పి, కాంగ్రెస్‌కు పట్టం కట్టారని పేర్కొన్నారు. తాము ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి తీరుతామన్నారు. బీఆర్‌ఎస్ నేతల అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మరాదని కోరారు. గత ప్రభుత్వం మాదిరిగా మీ సేవా కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలను తిప్పుకోకుండా, నేరుగా వారి వద్దకే వచ్చి పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరు గ్యారంటీలు అందుతాయన్నారు. ప్రజా సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. పట్టణంలోని పలు వార్డుల్లో నెలకొని సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. 34వ వార్డులో ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని, అలాంటి వారిని చట్ట ప్రకారం శిక్షిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, కౌన్సిలర్లు సోమశేఖర్, ఆసిఫ్, ప్రభాకర్ గౌడ్, నాయకులు ధారాసింగ్, సర్దార్‌ఖాన్, మల్లికార్జున్, డాక్టర్ సంపత్, పట్లోళ్ల బాల్‌రెడ్డి, హబీబ్‌లాలా, అబ్దుల్ రవూఫ్, గాజుల మాధవి, వేణుగోపాల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# కొడంగల్‌కు వృత్తి నైపుణ్య విశ్వ విద్యాలయం

- కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి స్థల పరిశీలన చేసిన
- రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణి కుముదిని

కొడంగల్: కొడంగల్ నియోజకవర్గానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వృత్తి నైపుణ్య విశ్వ విద్యాలయాన్ని మంజూరు చేశారు. శనివారం రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణి కుముదిని కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి కొడంగల్, బొంరారస్‌పేట మండలాల్లో ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. కొడంగల్ మున్సిపల్ పరిధిలోని బూల్కాపూర్ శివారులో, బొంరాస్‌పేట మండలంలో ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. స్థలం అందుబాటులో ఉన్న ప్రాంతంలో వృత్తి నైపుణ్య విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. కొడంగల్ ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో కలెక్టర్ నారాయణరెడ్డి విలేకరులతో మాట్లాడారు. కొడంగల్ నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటుకు అనువైన స్థలాలను పరిశీలించినట్లు చెప్పారు. ప్రస్తుతం పరిశీలన చేశామని, త్వరలో క్షేత్రస్థాయిలో పనులు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్‌వీకే నగేష్, టెక్నికల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ రాజేందర్ సింగ్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్‌లో ప్రభుత్వ స్థలాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న రాణి కుముదిని, కలెక్టర్ నారాయణరెడ్డి

### గురుకుల ప్రవేశాలకు గడువు పొడిగింపు

రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ప్రాంతీయ సమన్వయాధికారి శారద

మొయినాబాద్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాల దరఖాస్తు గడువును ఈ నెల 20 వరకు పొడిగించినట్లు రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ప్రాంతీయ సమన్వయాధికారి శారద వెంకటేశ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారంతో దరఖా స్తు గడువు ముగియనుండగా దాన్ని 20 వరకు పొడిగించామన్నారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## క్లుప్తంగా

### వికసించిన బ్రహ్మకమలం


వికసించిన బ్రహ్మకమలం పుష్పాలు

కొడంగల్ రూరల్ : మండలంలోని అప్పాయిపల్లికి చెందిన శైలేష్‌సింగ్ నివాసంలో శనివారం రాత్రి బ్రహ్మకమలం పుష్పాలు వికసించాయి. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు బ్రహ్మకమలం పుష్పాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మకమలం పుష్పాలు వికసించడంతో పరిసరప్రాంతమంతా సుగంధద్రవ్యాల సువాసనలు వెదజల్లడంతో పరిసరవాసులు వీక్షించేందుకు ఆసక్తి చూపారు. బ్రహ్మకమలం పుష్పం వికసించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని శైలేష్‌సింగ్ కుటుంబసభ్యులు తెలిపారు.

### ప్రభుత్వ స్థలాలను పరిరక్షించండి


ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న సోమశేఖర్

తాండూరు టౌన్ : పట్టణంలోని 34వ వార్డులో ఉన్న ప్రభుత్వ స్థలాలను కబ్జాకోరుల బారి నుంచి కాపాడాలని కోరుతూ ఆ వార్డు తెలంగాణ జన సమితి కౌన్సిలర్ సోమశేఖర్ కోరారు. శనివారం ప్రజాపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి సమస్యలను వివరిస్తూ ఆయన వినతి ప్రతం అందజేశారు. వార్డు పరిధిలోని ప్రభుత్వ స్థలాలపై కన్నేసిన అక్రమార్కులు నకిలీ పత్రాలను సృష్టించి కబ్జా చేయాలని యత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. వెంటనే ఆ స్థలాల చుట్టూ కంచె వేసి కబ్జాదారుల నుంచి కాపాడాలన్నారు. అలాగే వార్డు పరిధిలో అర్ధాంతరంగా నిలిచిపోయిన డ్వాక్రా భవన నిర్మాణం పూర్తి చేయించాలని, మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యామ్నాయంగా కాగ్నానది నుంచి అత్యవసర సమయంలో తాగునీటిని వినియోగించుకునేలా కనెక్షన్ ఇవ్వాలని వినతి పత్రంలో కోరారు.

### రోడ్డు పనుల పరిశీలన

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్‌లోని సాయినగర్ కాలనీలో వేస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత పరిశీలించారు. రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలని అధికారులు, గుత్తేదారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఈ జ్యోతి, ఏఈఈ వినీల్‌గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఉన్నత శిఖరాల వైపు పయనం

ప్రాణాలు ప్రణంగా పెట్టి కొండలు, గుట్టలు, పర్వత శిఖరాలను అధిరోహించడాన్ని రాక్ క్లైంబింగ్ అంటారు. రాక్ క్లైంబింగ్‌పై మక్కువతో నిరుపేద గిరిజన యువకులు ముందుకు రావడం అభినందనీయం. ప్రతిభ ఉన్న యువకులకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకిగా మారుతున్నాయి. కిలిమంజారో శిఖర అధిరోహణకు అవకాశం వచ్చిన కుల్కచర్ల మండల వాసి లావుడ్య శ్రీకాంత్ పరిస్థితులపై 'సాక్షి' కథనం.

- రాక్ క్లైంబింగ్‌లో గిరిజన యువకుడు సత్తా
- కిలిమంజారో శిఖరం అధిరోహణకు అవకాశం
- ఆర్థిక ఇబ్బందులతో సతమతం
- దాతలు సహరిస్తే ఉన్నత శిఖరాలపై జాతీయ జెండా ఎగురవేస్తానంటున్న లావుడ్య శ్రీకాంత్


జమ్ములో సైనికులతో శ్రీకాంత్

కుల్కచర్ల: మట్టిలో మాణిక్యం దాగి ఉంటుందనే నానుడిలా గ్రామీణ ప్రాంత యువతీ యువకుల్లో ఎంతో అపారమైన ప్రతిభ దాగి ఉంది. వారిలోని ప్రతిభను బహిర్గతపరిచే సందర్భాలు ఎక్కువ రాక పోవడంతో చీకటిలోనే కనుమరుగవుతున్నారు. ప్రతిభ ఉన్నా ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారుతుండటంతో ఎదుటివారి సహకారం కోరుతున్నారు. కుల్కచర్ల మండలం గోరిగడ్డతండా గ్రామ పంచాయతీకి చెందిన లావుడ్య శ్రీకాంత్ రాక్ క్లైంబింగ్‌లో ఎంతో ప్రతిభను చాటుతున్నాడు.

**వలస కుటుంబం నుంచి..**

లావుడ్య శ్రీకాంత్ కుటుంబం వలసలపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. కుల్కచర్ల మండలం, గోరిగడ్డ తండాకు చెందిన లావుడ్య రుక్మిణిబాయిలాల్యల కుమారుడు శ్రీకాంత్ స్వగ్రామంలో చదువు కొనసాగిస్తూ, రాక్ క్లైంబింగ్‌లో తనదైన సత్తా చాటుతున్నాడు. వీరు వలసలపై ఆధారపడి కుటుంబాన్ని పోషించుకోవాల్సిన పరిస్థితి. కనీస అవసరాలు తీరుకునేందుకు వారు చేస్తున్న కష్టం సరిపోతున్నప్పటికీ రాక్ క్లైంబింగ్‌లో ముందుకు సాగాలంటే అందనిద్రాక్షలా మారుతోంది.

**ఉన్నత శిఖరాల వైపు అడుగులు**

లావుడ్య శ్రీకాంత్ భువనగిరి కొండన, జమ్ముకాశ్మీర్‌ను అధిరోహించారు. కాగా, ప్రస్తుతం కిలిమంజారో శిఖరాన్ని అధిరోహించేందుకు శ్రీకాంత్‌కు అవకాశం వచ్చింది. వివిధ ప్రాంతాల్లో రాక్ క్లైంబింగ్‌లో ప్రతిభ చాటడంతో జనవరిలో కిలిమంజారో పర్వత శిఖరాన్ని అధిరోహించేందుకు ఎంపికయ్యాడు. గిరిజన ఆవాసాలకు చెందిన యువకుడు రాక్ క్లైంబింగ్‌లో రాణించి ఖండాంతరాలకు తమ గ్రామం, దేశ ఖ్యాతిని ఇనుమడింపజేసేలా ప్రతిభ చాటడం పట్ల సర్వత్ర ప్రశంసలు అందుకుంటున్నాడు.

**అవరోధంగా ఆర్థిక పరిస్థితి..**

కిలిమంజారో శిఖరాన్ని అధిరోహించడానికి ఈ నెల 18న తేదీ వెళ్లాల్సి ఉంది.. శిఖరం అధిరోహణకు రూ.3లక్షల వరకు ఖర్చు ఉండడంతో దాతల కోసం ఎదురు చూస్తున్నాడు. నా రాక్ క్లైంబింగ్ పయనానికి దాతలు సహకారం అందిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తానని వేడుకుంటున్నాడు. సంప్రదించాల్సిన గూగుల్‌పే, ఫోన్ పే 87677 23425.


భువనగిరి కొండను అధిరోహిస్తున్న శ్రీకాంత్ (ఫైల్)

**సంకల్పంతో ముందుకు..**



రాక్ క్లైంబింగ్‌పై ఆసక్తితో స్థానిక కోచ్‌ల సహకారంతో ఎత్తైన శిఖరాలను అధిరోహించేందుకు వేసిన నా అడుగులు ప్రస్తుతం కిలిమంజారో శిఖరాన్ని అధిరోహించేందుకు బలాన్ని చేకూర్చింది. దాతలు సహరిస్తే కిలిమంజారో పాటుగా భవిష్యత్తులో ఎవరెస్ట్ హిమాలయాలను అధిరోహించాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నా. – లావుడ్య శ్రీకాంత్

# దేశం గర్వించే సైంటిస్టులు కావాలి

స్పీకర్ ప్రసాద్‌కుమార్



మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్

అనంతగిరి: నేటి యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా సన్మార్గంలో పయనించాలని అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని సత్యభారతి గార్డెన్‌లో యజ్ఞ సంస్థ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు స్పేస్ సైన్స్ కాంగ్రెస్ (అంతరిక్ష విజ్ఞాన సదస్సు) కార్యక్రమం నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. స్వామి వివేకానంద జీవితం అందరికీ ఆదర్శమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను వమ్ము చేయకుండా కష్టపడి, ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసే బాధ్యత ఉపాధ్యాయులదేనని, అందుకు తల్లిదండ్రులు సైతం సహకరించాలన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకుని మంచి భవిష్యత్తుకు మార్గం వేసుకోవాలన్నారు. అనంతరం చంద్రయాన్-3 అసోసియేట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఇస్రో సైంటిస్టు కె.కల్పన మాట్లాడుతూ.. నేటి యువత ప్రపంచానికి మనదేశ కీర్తిని చాటుతున్నారన్నారు. చంద్రయాన్-3 ఎన్నో ఏళ్ల కృషి ఫలితమన్నారు. సమష్టి కృషి ఫలితమే ఈ విజయమన్నారు. సక్సెస్ కావాలంటే తప్పకుండా మన కృషి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరు సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలన్నారు. అనంతరం ఆమె అంతరిక్ష పరిశోధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు పలు సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా క్విజ్‌పోటీలతో పాటు స్పెస్ సైన్స్ మోడల్ ప్రజెంటేషన్ చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్‌కుమార్, డీఈఓ రేణుకాదేవి, డీడబ్ల్యూఓ లలితకుమారి, చైల్డ్ వేల్ఫేర్ కమిటీ చైర్మన్ వెంకటేశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, ఎంఈఓ బాబుసింగ్, మల్లారెడ్డి హెల్త్ సిటి డైరెక్టర్ డాక్టర్ భద్రారెడ్డి, యజ్ఞ సంస్థ చైర్మన్ డాక్టర్ రాజశేఖర్, ప్రెసిడెంట్ డాక్టర్ ఉజ్వలీరాజు, స్కూల్ ప్రిన్సిపల్ అనురాధ, ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ దుకాణం సీజ్



షాపును సీజ్ చేస్తున్న ఏఓ

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని అనురాధ ట్రేడర్స్ ఫర్టిలైజర్ షాపును శనివారం మండల వ్యవసాయధికారి లావణ్య సీజ్ చేశారు. ఫర్టిలైజర్ షాపు లైసెన్స్ గడువు ముగిసినా షాపు తెరిచి విక్రయాలు జరుపుతున్నారు. ఇటీవల రెండు సార్లు హెచ్చరించి అధికారులు నోటీసులు జారీ చేశారు. అయినా, లైసెన్స్ రెన్యూవల్ చేసుకోకపోవడంతో సీజ్ చేసినట్లు వ్యవసాయధికారి లావణ్య తెలిపారు.

## నూతన నియామకం


ఎన్నికైన సంఘం సభ్యులు

వికారాబాద్: తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘం(టీపీజేఎంఏ) ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా వికారాబాద్‌కు చెందిన శ్రీనివాస్ ఎన్నికయ్యారు. శనివారం హైదరాబాద్‌లోని బండ్లగూడలో జరిగిన ఉమ్మడి జిల్లా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ కళాశాలల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా ఇంద్రసేనారెడ్డి, కోశాధికారిగా శ్రీను, ఉపాధ్యక్షుడిగా చంద్రకాంత్, అంజనేయులు, సంయుక్త కార్యదర్శులుగా భాస్కర్, సురేంద్రనాథ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శశిధర్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యవర్గసభ్యులుగా గౌరి సతీష్, రాజవర్ధన్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, సలహాదారులుగా రంగారావు, ఎల్ఎస్ఎన్ మూర్తిలను ఎన్నుకున్నారు.

# గంజాయి పట్టివేత


విలేకరులతో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ

ధారూరు: కర్ణాటక నుంచి ద్విచక్ర వాహనంపై ఎండు గంజాయిని తరలిస్తున్న ఇద్దరి వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం ధారూరు సర్కిల్ సీఐ రామకృష్ణ విలేకరులతో మాట్లాడారు. కర్ణాటకలోని జిల్‌వర్షా గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై సుభాష్, అనిల్‌కుమార్‌లు బంట్వారం మండలం తొర్మామిడి గ్రామం వైపు వస్తున్నారు. బొప్పునారం చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న బంట్వారం ఎస్‌ఐ స్రవంతి, ఏఎస్‌ఐ అంజద్, సిబ్బంది ద్విచక్రా వాహనాన్ని తనిఖీ చేశారు. వారి నుంచి అర కిలో ఎండు గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. బీదర్ నుంచి తక్కువ ధరకు గంజాయిని తీసుకువచ్చి తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో విక్రయిస్తున్నట్లు నిందితులు చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రామకృష్ణ వివరించారు.

## విద్యుత్ షాక్‌తో ఆవు మృతి


మృతి చెందిన ఆవు వద్ద రైతు

కుల్కచర్ల : విద్యుత్ షాక్‌తో ఆవు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కుసుమ సముద్రంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బైరం శ్రీనివాస్ అనే రైతు జీవనోపాధి కోసం ఆవులను తెచ్చుకున్నాడు. పొలంలో మేత మేస్తుండగా కరెంట్ తీగలను తాకడంతో షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందింది. గమనించి రైతు ఆవు దగ్గరకి వచ్చి చూసే సరికి అప్పటికే ప్రాణాలు విడిచింది. దీంతో బాధిత రైతు కన్నీరుమున్నీరయ్యారు. ఆవు విలువ సుమారు రూ. 60 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

## వైభవంగా రేణుకా ఎల్లమ్మ జాతర

యాలాల: మండల పరిధిలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయ జాతరోత్సవాలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ప్రతిష్ఠించి రథోత్సవం చేశారు. ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి హాజరై ప్రత్యేక నిర్వహించారు.

## రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనంతగిరి: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి వికారాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. వికారాబాద్ పట్టణంలోని రామయ్యగూడకు వెళ్లే మార్గంలోని రైల్వే గేట్ సమీపంలో బీదర్ వైపు మార్గంలో ఓ 25 ఏళ్ల యువకుడు రైలు కిందపడి మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకుని విచారించగా గుర్తు తెలియని వ్యక్తిగా గుర్తించారు. మృతుడి దగ్గర ఫోన్ లభించింది. ఫోన్ ఆధారంగా వివరాలు సేకరిస్తున్నామని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ అనిల్ తెలిపారు.

## భార్య కాపురానికి రావడంలేదని..

భర్త ఆత్మహత్య

నందిగామ: భార్య కాపురానికి రావడం లేదనే మనస్తాపంతో వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని చాకలిగుట్ట తండాలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ కథనం ప్రకారం.. బీహార్‌కు చెందిన విహారి కుమార్(23), భార్యగౌరితో పాటు తమ్ముడు హీరోలాల్‌లు బతుకు దెరువు కోసం నందిగామ మండలం చాకలిగుడ్డ తండాకు కొన్ని ఏళ్ల క్రితం వలస వచ్చారు. వీరు స్థానికంగా ఉన్న ఓ ఐరన్ పరిశ్రమలో కార్మికులుగా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. కాగా, వీహారి కుమార్‌తో అతడి భార్య గౌరిలకు మనస్పర్థలు రావడంతో గౌరి తన సొంతూరుకు గత 10 నెలల క్రితం వెళ్లిపోయింది. దీంతో వీహారి కుమార్ తన భార్యను కాపురానికి రావాలని ఎంతగా ప్రయత్నించిన కూడా రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రాత్రి ఇంట్లో తమ్ముడు లేని సమయంలో ఐరన్ రాడుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మే రకు మృతుడి తమ్ముడు హీరోలాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

**అప్పుల బాధతో..**

అప్పులబాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని చాకలిగుట్ట తండాలో శుక్రవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. చాకలిగుట్ట తండాకు చెందిన జటావత్ తౌర్య (26) తన కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పుల విషయమై గత కొంతకాలంగా కుమిలిపోతున్నాడు. అప్పులను ఎలా తీర్చాలనే విషయమై ఇంట్లో తరుచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి తన భార్య ప్రేమ, తల్లి మారుతో గొడవపడి వారిపై దాడి చేశాడు. వారిని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా క్షణికావేశానికి గురైన తౌర్య ఉరేసుకొని అత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

# మళ్లీ నరేంద్రమోదీయే ప్రధాని

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


అంబాజీరావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి, కె.ఎస్.రత్నం తదితరులు

మొయినాబాద్‌రూరల్: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని మళ్లీ నరేంద్రమోదీ ప్రధానమంత్రి అవుతారని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నంలు ధీమా వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని అప్పారెడ్డిగూడలో నూతనంగా బీజేపీ జెండాను మండల పార్టీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎగురవేశారు. గ్రామ సర్పంచ్ అంబాజీరావుతో పాటు పలువురు వార్డు సభ్యులు బీజేపీలో చేరారు. ముఖ్యఅతిధులుగా మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డిలు పాల్గొని జెండా ఆవిష్కరించారు. అనంతరం సర్పంచ్ అంబాజీరావుకు బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ.. దేశంలోనే ఏ గ్రామంలో చూసినా జాతీయ సేవా కార్యక్రమాలు నరేంద్రమోదీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఎన్నో అందుతున్నాయని గుర్తు చేశారు. అలాంటి భారతీయ జనతా పార్టీని గెలిపించుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారన్నారు. జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలోని అధిక స్థానాలను గెలిపించుకుని నరేంద్రమోదీని ప్రధానమంత్రి చేసుకునేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీలో చేసిన ఆయా వార్డు సభ్యులు, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

# పేకాట రాయుళ్ల అరెస్టు


పోలీసులు అదుపులో నిందితులు

తాండూరు టౌన్ : పేకాట ఆడుతున్న వ్యక్తులను అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ జిల్లా ఇన్‌చార్జి ప్రశాంత్‌వర్ధన్ శనివారం వెల్లడించారు. జిల్లా ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల ప్రచారం తాండూరు మండలం అంతారం గ్రామ శివారులో ఏడుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ. 50,260 నగదు, ఏడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

# కుటుంబ కలహాలతో గృహిణి ఆత్మహత్య


మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు


చంచల్ జోషి (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: కుటుంబ కలహాలతో గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం ఆదిబట్ల సీఐ రఘువీర్‌రెడ్డి కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం కమలాపూర్ గ్రామానికి చెందిన చంచల్ జోషికి సంవత్సరాల క్రితం నారాయణ జోషితో వివాహం జరిగింది. వీరు జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చి తుర్కయంజాల్‌లో నివాసిస్తున్నారు. వీరికి గజనందుని, రుషికేష్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. సాఫీగా సాగుతున్న కుటుంబంలో గత కొంతకాలంగా భార్యాభర్తలు మధ్య గొడవలు జరుతున్నాయి. భర్త మానసికంగా వేధిస్తుంచే వాడని, వేధింపులు తాళలేక శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు వెల్లడించారు. శనివారం తుర్కయంజాల్‌లో భర్త ఇంటి ఎదుట కుటుంబ సభ్యులు ఆందోళకు దిగారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు వెల్లడించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం మార్చురీకి తరలించారు.

## ప్రజలకు వారధిగా ఉండాలి

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్


కేఎల్లార్‌ను కలిసిన పార్టీ నాయకులు

తుక్కుగూడ : కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్యవారధిగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ సూచించారు. శనివారం తుక్కుగూడ మున్సిపాలిటీకి చెందిన ఆ పార్టీ నాయకులు నగరంలోని ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై ఫోకస్ చేసి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని పార్టీ పదవులను రద్దు చేశామన్నారు. త్వరలో నూతన కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి జానకీరామ్, ధనంజయ్, రాజుకుమార్, రాజేందర్‌గౌడ్, యాదయ్య ఉన్నారు.

# త్వరలో ఇందిరమ్మ గ్రామ కమిటీలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట: రాష్ట్రంలో వైఎస్ఆర్ పాలన తీసుకువచ్చేందుకు త్వరలోనే ఇందిరమ్మ గ్రామ కమిటీలను వేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ప్రజాపాలన ముగింపు కార్యక్రమం మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ... వైఎస్ఆర్ పాలన మాదిరిగా గ్రామాల్లో సభలను ఏర్పాటు చేసి లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ప్రారంభించిన భవనం శిధిలావస్థకు చేరడంతో దానిని కూల్చివేసినట్లు గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే అలాంటి భవనం మళ్లీ నిర్మించేందుకు నిధులు అందిస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. అనంతరం మండల అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు.

**ప్రత్యేక పూజలు...**

మండలంలోని వేములనర్వ గ్రామ శివారులోని నంబాయ్యగుట్టపై కొనసాగుతున్న శ్రీవేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారి కల్యాణం గ్రామ సర్పంచ్ మంజుల మల్లేష్, జ్యోతి రాధాకృష్ణ, లాస్య ఆనంద్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాల శ్రావణ్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, ఆర్డీఓ వెంకట మాధవరావు, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి విజయలక్ష్మి, తహసీల్దార్ అజీంఅలీ, ఎంపీడీఓ రవిచంద్రకుమార్ రెడ్డి, మండల విద్యాధికారి మనోహర్, సీడీపీఓ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# అవకతవకలు జరిగితే సహించం

ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు

కొందుర్గు: ఎరువుల విక్రయంలో అవకతవకలు జరిగితే సహించమని తహసీల్దార్ రమేష్ కుమార్ హెచ్చరించారు. శనివారం తహసీల్దార్ , మండల వ్యవసాయాధికారి, ఎస్సై కృష్ణయ్య కలిసి కొందుర్గు మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలతో పాటు కొందుర్గు ప్రాథమిక సహకార సంఘాన్ని సందర్శించి ఎరువుల స్టాకు వివరాలు, క్రయ, విక్రయాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల వారీగా ఎరువుల విక్రయాలను పరిశీలించారు. రైతు ఒక ఎకరం విస్తీర్ణానికి గాను డీఏపీ, రెండు యూరియా బస్తాలు వేయవచ్చని, ఒకవేళ ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా మరో దఫా అదనంగా ఎరువులు వేయవచ్చని వ్యవసాయాధికారి మధుసూధన్ సూచించారు. ఇంతకుమించి అధిక మోతాదు వినియోగించరాదని స్పష్టం చేశారు. కొందుర్గు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో చెర్కుపల్లి గ్రామానికి చెందిన ప్రకాష్‌రెడ్డి అనే రైతు 50 బస్తాల యూరియా కొనుగోలు చేయడం పట్ల అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. రైతు ప్రకాష్ రెడ్డి తన పొలానికి వినియోగించాడా లేదా యూరియా పక్కదారి పట్టిందా అంటూ అనుమానం వ్యక్తం చేశారు. రైతు పట్టాదారు పాసుపుస్తకం, సాగు వివరాలను అందజేయాలని సూచించారు.